www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 29 సెప్టెంబర్ 2023
5
అన్నమయ్య



స్వామినాథన్ మృతి దేశానికి తీరని లోటు : సిపిఎం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ స్వామినాథన్ మృతి దేశానికి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారతదేశ హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ ఉదయం చెన్నైలో కన్నుమూశారన్నారు. అధిక దిగుబడినిచ్చే వరి రకాలను అభివృద్ధి చేయడంలో స్వామినాథన్ కీలకపాత్ర పోషించారని తెలిపారు. స్వామినాథన్ చెన్నైలో ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను స్థాపించిన తర్వాత 1987లో మొదటి ప్రపంచ ఆహార బహుమతిని అందుకున్నారని తెలిపారు. అనేక అవార్డులతో పాటు, స్వామినాథన్ చేసిన కృషికి 1971లో రామన్ మెగసెసే అవార్డు, 1986లో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ వరల్డ్ సైన్స్ అవార్డు పొందరని కొనియాడారు. హరిత విప్లవం వ్యవస్థాపకుడుగా, వ్యవసాయ సంక్షోభానికి విరుగుడుగా ఆయన చేసిన సిఫార్సులు అత్యంత విలువైనవని, అవి నేటికీ అనుసరణీయమైనవని తెలిపారు. వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి, రైతులు, కూలీల సంక్షేమానికి పరిశోధనలు చేసి ప్రభుత్వాలకు ఆయన చేసిన సిఫారసులు అమోఘం అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకూ సానుభూతిని తెలిపారు.

జిపిఎస్ అమలు దుర్మార్గం : యుటిఎఫ్



మదనపల్లె : జిపిఎస్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా జిపిఎస్ అమలుకు చర్యలు చేపట్టడం దుర్మార్గమని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రవిప్రకాష్ అన్నారు. జిపిఎస్ తేవడాన్ని నిరసిస్తూ గురువారం యూటిఎఫ్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జిపిఎస్ ప్రతులను దగహనం చేశారు. ఈ సందర్భంగా రవి ప్రకాష్, జిల్లా కార్యదర్శులు సుధాకర్ నాయుడు, పురం వెంకటరమణ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన వారంలో సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను పున రుద్ధరిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి నేడు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులను తీవ్రంగా మోసం చేశారని పేర్కొన్నారు. ఒపిఎస్‌ను అమలు చేస్తే రాష్ట్రానికి తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులని ఆర్థిక మంత్రి పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. ఇచ్చిన హామీని తుంగలో తొక్కి ఉద్యోగులను తీవ్రంగా మోసం చేయడం సరికాదన్నారు. జిపిఎస్‌ను తెచ్చే ముందు ఏ ఒక్క ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాన్ని కూడా కూర్చోబెట్టుకొని చర్చించకుండా ఏకపక్షంగా జిపిఎస్ తేవడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ జిపిఎస్‌లో అంత మంచి ప్రతిపాదనలు ఉన్నట్లయితే ప్రస్తుతం ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కూడా జిపిఎస్‌ను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు సుధాకర్ హరికృష్ణ, శ్రీధర్, గొబ్రె నాయక్, సురేంద్ర, రామయ్య. భానుమూర్తి, ఇర్ఫాన్, పయని, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు. **రాయచోటి:** ఎన్నికల ప్రచారం లో మాట ఇచ్చినట్లుగా సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని, జిపిఎస్‌ను ఎట్టి పరిస్థితిలోనూ అంగీకరించే ప్రసక్తే లేదని బిటిఎ రాష్ట్ర కార్యదర్శి పల్వం రామచంద్ర పేర్కొన్నారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్దనున్న అంబేద్కర్ చిత్రపటం వద్ద జిపిఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. అనంతరం జిపిఎస్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో సిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ తీసుకొస్తామని ప్రతి ప్రచార సభలలో పదే పదే చెప్పి నమ్మించిన ముఖ్యమంత్రి ప్రస్తుతం పక్కకు తప్పుకోవడం భావ్యం కాదన్నారు. తాము కోరింది ఉద్యోగి ఎలాంటి కాంట్రిబ్యూషనూ లేని ఒపిఎస్‌ను మాత్రమేనని, లెక్కలు, మాటల లాజిక్కులతో కూడిన జిపిఎస్‌ను కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎవి.రమణ, ట్రెజరర్ గోపాల్ దాస్, రాజశేఖర్, జిల్లా నాయకులు బి రెడ్డయ్య, చిన్న, చెంద్రాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఝురికోన చెరువు ఆక్రమణ

- రాళ్లు, మట్టితో పూడ్చేస్తున్నారు
- ఆందోళనలో ఆయకట్టుదారులు

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని వీరబల్లి పంచాయతీలో ఉన్న ఝురికోన చెరువుకు సంబంధించిన భూమిని కొందరు రైతులు ఆక్రమించుకొని చదువును చేశారు. చుట్టుపక్కల భూముల్లో ఉన్న వృథా మట్టిని, రాళ్లను, చెట్లను జెసిబిలతో తొలగించి, ట్రాక్టర్లతో తీసుకొని వచ్చి చెరువులో తోలుతున్నారు. కొందరు చెరువు భూమిని అక్రమించుకోవడమే కాకుండా, తమ భూముల్లో ఉన్న మట్టిని, రాళ్ళను తీసుకొని వచ్చి చెరువును పూడ్చేస్తున్నారు. చెరువులో నీరు నిలవ కుండా పోవడాకి అవకాశం ఉంది. చెరువు స్థలం ఆక్రమణకు గురై చివరకు పూర్తిగా



చెరువులో వేసిన వృథా మట్టి, రాళ్లు



చెరువు మొరవకు వేసిన కంచె

చెరువే లేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్కల అయకట్టుదారులు పూర్తిగా నష్టపోనున్నారు. ఆక్రమణదారుడొకరు చెరువు మధ్యలో రెండు బోర్లు వేశారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను చెరువులో భూమికి దగ్గరగా ఏర్పాటు చేశారు. చెరువు వర్షపు నీటితో నిండినప్పుడు విద్యుత్ ప్రమాదం జరిగే అవకాశం ఉంది. చెరువులో బోర్లు వేయడంతో నీటి శాతం తగ్గిపోయి ఆయకట్టుదారుల బోర్లు ఎండిపోయే ప్రమాదం ఉంది. చెరువు నీటిని పోనివ్వకుండా మొరవకు ముళ్ళ తంతె కంచను ఏర్పాటు చేశారు. మొరవ ద్వారా నీరు పోకుండా చెరువు నీటి శాతం పెరిగి చెరువు కట్ట కూడా తెగిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా మండల రెవెన్యూ అధికారులు ఝురికోన చెరువును పరిశీలించి ఆక్రమణ గురికాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. మొరవకు వేసిన కంచెను తొలగించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ కూడా దృష్టి సారించాలని కోరుతున్నారు.



రాజంపేట : భగత్ సింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భగత్‌సింగ్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

భగత్ సింగ్ జయంతిని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ రాజంపేట కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బాలుర వసతి గృహంలో భగత్ సింగ్ 116వ జయంతిని నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వార్డెన్ నరసింహారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ బ్రిటీష్ తెల్ల దొరలకు వ్యతిరేకంగా, పరాయి పాలన నుండి విముక్తి కోసం, భారతదేశపు స్వాతంత్ర్యం కోసం 23 సంవత్సరాల అతి చిన్న వయసులోనే ఉరికంబాన్ని ముద్దాడిన గొప్ప విప్లవ పోరాట యోధుడు భగత్ సింగ్ అని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వానికి నిజమైన దేశభక్తి, జాతీయత భావాలు ఉంటే భగత్ సింగ్‌కి భారతరత్న అవార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యువత, విద్యార్థులు భగత్ సింగ్ ఆశయాలతో విద్యార్థుల సమస్యలు పరిష్కారం కొరకు, ఉద్యోగ సాధన కొరకు పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గోవర్ధన్, సురేంద్ర, సాయి, మధు, లవకుమర్, సురేష్, రవి హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** భగత్‌సింగ్ జయంతిని విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిఇఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక బాస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ 23 సంవత్సరాల వయసులోనే దేశ స్వాతంత్ర విముక్తి కోసం బ్రిటిష్ వారితో పోరాడాలని తెలిపారు. భగత్ సింగ్ స్ఫూర్తితో మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. దేశంలో యువతీ యువకులు సైదాంతిక, రాజకీయ అధ్యయనం చేయాలని, మహనీయుల త్యాగాలను స్ఫూర్తి బాటలో నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎఎస్‌పి పెద్దయ్య, విసికె, బాస్ నాయకులు నీరుగట్టి రమణ, చాట్ల బయన్న, రాయల్ సూర్య, పవన్ తేజ, సొన్నికంటి రెడ్డెప్ప, రవిశంకర్, జనార్ధన్, రెడ్డిప్రసాద్, క్రాంతి, నరేష్, రామప్ప, కదిరిప్ప పాల్గొన్నారు. **పీలేరు:** భగత్ సింగ్ జయంతిని ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ఎస్‌సి బాలుర వసతి గృహంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సాయి సంపత్ కుమార్, పీలేరు నియోజకవర్గ ఉపాధ్యక్షులు మహేష్, నాయకులు అఖిల్, అమర్, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుడి నిమజ్జనం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

స్థానిక తోటవీధి, కొత్తపేటవీధి, జెట్టిపాల్యెంవీధి, ఎన్టీఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రతిష్టించిన వినాయకుడి విగ్రహాలను గురువారం ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అలంకరించిన పల్లకిలో గణేషుని విగ్రహాలను ఏర్పాటు చేసి పట్టణంలోని పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున యువత కేరింతలు కొడుతూ ఉల్లాసంగా నృత్యాలను చేశారు. సాయంత్రం దాకా పురవీధుల్లో ఊరేగించి పట్టణ శివారు ప్రాంతంలోని చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో యువత, మహిళలు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం చేస్తున్న సొసైటీ సభ్యులు

వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం

ప్రజాశక్తి -రాయచోటి టౌన్

పట్టణంలోని కొత్తపల్లి నూరాని మసీదు దగ్గర నివసిస్తున్న హసీనా బాను అనే మహిళకు షుగర్ వ్యాధి వల్ల కాలుకి ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పడంతో, ఆర్థిక ఇబ్బందులు కారణంగా పడుతూ గురువారం సొసైటీ వారిని సంప్రదించారు. సొసైటీ వారు స్పందించి ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సొసైటీవైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ అలీ, కార్యదర్శి సిబాతుర్ రహిమాన్, కోశాధికారి ముహీబుల్ల, సభ్యుడు మహమ్మద్ ఇలియాస్ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి...

రాయచోటి : మండలంలోని దిగువ అబ్బవరానికి చెందిన రజనీకాంత్ కుమారుడు అఖిల్ అనే యువకుడు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధప డుతూ బెంగళూరు సిటీలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రజనీకాంత్ కుటుంబసభ్యులు గురువారం ఉదయం మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా అఖిల్ ఆస్పత్రి ఖర్చులకు ఆర్థిక సాయం అందజేశారు. ద్వారకనాథ్‌రెడ్డి మాట్లాడుతూ చిన్న వయసులోనే అఖిల్‌కు కిడ్నీలు దెబ్బతినడం చాలా చింతించాల్సిన విషయమన్నారు. అఖిల్ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

కడప కారాగారం నుంచి 72 మంది విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పుంగనూరు పర్యటనలో జరిగిన అల్లర్ల సంఘటనలో అన్నమయ్య జిల్లా అంగళ్లు, పుంగనూరు టిడిపి చెందిన 72 మంది కార్యకర్తలు గురువారం బెయిల్‌పై విడుదలయ్యారు. వారికి టిడిపి జిల్లా నాయకులు కడప సెంట్రల్ జైలు ప్రధాన గేటు వద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అక్రమ కేసులతో జైలుకు వెళ్లామని, బాధపడే కన్నా రాష్ట్ర ప్రజల సంక్షేమమే ముఖ్యమన్న లక్ష్యంగా వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై మరింత పోరాటం చేయాలన్నారు. 14 ఏళ్ళు ముఖ్యమంత్రిగా ప్రజా సంక్షేమానికి పాటు పడిన, టిడిపి అధినేత చంద్రబాబును నిరాధారమైన అవినీతి ఆరోపణలతో అరెస్టు చేసి జైలుకు పంపిన జగన్ ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకలించే వరకు తెలుగుదేశం పార్టీ కుటుంబం విశ్రమించకూడదని చెప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం చారిత్రాత్మక అవసరమని అన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి మాట్లాడుతూ ఎన్ని కుట్రలతో అరెస్టు చేసి జైలుకు పంపిన నిర్దోషులుగా బయటకి రావడం జరుగుతుందన్నారు. చంద్రబాబు జైలు నుంచి బయటకు వస్తారని రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. న్యాయమే గెలుస్తుంది అన్నది జగమెరిగిన సత్యం అన్నారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిలు హరిప్రసాద్ , గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వైసిపి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దుర్మార్గానికి నిదర్శనం, అక్రమ కేసులతో టిడిపి నాయకులను జైళ్లకు పంపడమే అన్నారు. కేసులతో భయపెట్టి తిరిగి గెలవాలన్నదే వైసిపి నేతల లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బది'లీల'లు

- ఆర్‌డిలో మాడిఫికేషన్ ఉత్తర్వుల జోరు
- డిఎంఒలో నలుగురు ఎంపిహెచ్ఇఒలు
- 143 జిఒ అమలులో అలసత్వం



ప్రజాశక్తి- కడప ప్రతినిధి

జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో మాడిఫికేషన్ బదిలీల పర్వం కొనసాగుతోంది. ప్రభుత్వం గతంలో జారీ చేసిన 143 జిఒ ప్రకారం పిహెచ్‌సి కేంద్రాల్లో ఒకే రకమైన పోస్టులు ఉండకూడదని నిర్ణయించిన సంగతి తెలిసిందే. గత నెల 24, 25వ తేదీల్లో రీజినల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఉమ్మడి కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చెందిన పిహెచ్‌సి కేంద్రాల్లోని అన్ని కేడర్లకూ రీ డిప్లాయ్ మెంట్ చేశారు. తాజాగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ అమరావతి యంత్రాంగం డిఎంహెచ్ఒ, జిల్లా మలేరియా కార్యాలయాలకు ఇద్దరు చొప్పున ఎంపిహెచ్ఇలను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను మానిటరింగ్ చేయడానికి ఇద్దరు ఎంపిహెచ్ ఇఒలను, జిల్లా మలేరియా కార్యాలయంలో ఫీల్డ్, రిజర్వ్ నిమిత్తం ముగ్గురు ఎంపిహెచ్ఇలను నియమించింది. వీరిలో ఇద్దరిని మైదుకూరు, పోరుమామిళ్ల ప్రాంతాల ఫీల్డ్ నిమిత్తం, రిజర్వ్ నియమిత్తం ఒకరిని కేటాయించారు. గత నెలలో నిర్వహించిన రీ డిప్లాయ్‌మెంట్ కౌన్సిలింగ్‌లో జోనల్ అధికారి జిల్లా మలేరియా కార్యాలయంలో ముగ్గురు ఉండగా మరో నలుగురు ఎంపిహెచ్ఇలను కేటాయించింది. ఈలెక్కన జిల్లా మలేరియా కార్యాలయంలోనే ఏడుగురు ఎంపిహెచ్ఇలు ఉన్నట్లు లెక్క తేలుతోంది. 143 జిఒ ప్రకారం రీ డిప్లాయ్ మెంట్ కౌన్సెలింగ్ ముగిసి నెల రోజులు గడిచిన తరువాత మూడు పిహెచ్‌సి కేంద్రాల్లో ఖాళీలను ఉంచి జిల్లా మలేరియా అధికారి కార్యాలయానికి బదిలీ చేయడంలోని మతలబేమిటో తెలియడం లేదు. కడప -అనంతపురం జిల్లా సరిహద్దు పిహెచ్‌సి నుంచి ఒకరిని, మిగిలిన ఇద్దరిని అన్నమయ్య, అనంతపురం జిల్లాల పిహెచ్‌సి కేంద్రాల నుంచి బదిలీ చేయడం గమనార్హం. ఇటువంటి బదిలీలతో 143 జిఒను అపహాస్యం చేసినట్లు అవుతోందనే వాదన వినిపిస్తోంది. పిహెచ్‌సిల్లో ఉండాల్సిన ఎంపిహెచ్ఇలను నిబంధనలకు వ్యతిరేకంగా జిల్లా మలేరియా అధికారి కార్యాలయానికి సుమారు నలుగురిని కేటాయించడం గమనార్హం. వీరిలో ఒకరు రాష్ట్రానికి చెందిన ఉన్నతాధికారికి సన్నిహితంగా వ్యవహరాల్ని చక్కబెడుతున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపిహెచ్ఇ రీ డిప్లాయ్‌మెంట్ కింద అనంతపురం జిల్లాకు వెళ్లాల్సి ఉండగా మళ్లీ జిల్లా మలేరియా కార్యాలయం (డిఎంఒ)లో నియమితులు కావడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఆర్‌డిని ఫోన్‌లో సంప్రదించగా అందు బాటులోకి రాకపోవడం గమనార్హం.

గుర్రం జాషువా సేవలు చిరస్మరణీయం

- జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం

ప్రజాశక్తి-రాయచోటి

గుర్రం జాషువా సేవలు చిరస్మరణీయమని జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ 1895 సెప్టెంబర్ 28వ తారీకున ఉమ్మడి గుంటూరులోని వినుకొండ గ్రామంలో జన్మించారని పేర్కొన్నారు. గుర్రం జాషువా తన రచనల ద్వారా అణగారిన వర్గాలకు ఎన్నో సేవలందించారని, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారని తెలిపారు. లక్కిరెడ్డిపల్లి జూనియర్ కళాశాల అధ్యాపకుడు సహదేవరెడ్డి మాట్లాడుతూ గుర్రం జాషువా కవిత్వం అనే ఆయుధంతో సమాజాన్ని మేల్కొల్పారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నాగరాజ, హౌసింగ్ పీడీ సాంబశివయ్య, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అబ్ సలాం, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** విప్లవ వీరుడు భగత్ సింగ్, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువ జయంతిని గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో భగత్ సింగ్, గుర్రం జాషువ



రాయచోటి : జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు



వాల్మీకిపురం : జాషువా, భగత్ సింగ్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కల్పన, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు. **పీలేరు:** గుర్రం జాషువా సాహిత్యం సామాజిక మార్పుకు, సంఘ అభ్యుదయానికి తోడ్పడుతుందని వక్తలు తెలిపారు. తెలుగు భాషా సమితి సారథ్యంలో నవయుగ కవి చక్రవర్తి బిరుదాంకితుడైన గుర్రం జాషువా జయంతిని ఎపి బాలికల గురుకుల పాఠశాలలో ఇన్‌ఛార్జి ప్రధానాచార్యులు రేవతి అధ్యక్షతన నిర్వహించారు. జాషువా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు సరస్వతి శ్రీరాములురాజు, తెలుగుభాషా సమితి అధ్యక్షులు సిఆర్‌పి జలకనూరి మురళీధర్ రాజు, సిఎన్ఆర్ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు కోటా బాలాంజనేయులు, విఎస్ఎన్ సిద్ధార్థ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.చలపతి నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** నవయుగ కవి చక్రవర్తి, పద్మభూషణ్ బిరుదాంకితులు మహాకవి గుర్రం జాషువా 128వ జయంతిని తెలుగు భాషా సంరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక జవుళీ బజారులోని సరస్వతీ విద్యా మందిరంలో నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి జిల్లా సహాయక కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ, తెలుగు భాషా సంరక్షణ సమితి ప్రతినిధులు బి.వినారాయణరాజు, రాయుడు, గుంటూరు రామయ్య, సుబ్రహ్మణ్యం, దయాకర్, ఉష, ప్రియాంక పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాదున్ నబీ ఉత్సవాలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మహమ్మద్ మహా ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం వాల్మీకిపురంలో ముస్లిములు ఈద్-మీలాద్-జులూస్ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మీలా ఉన్ నబీ జెండాలు, బ్యానర్లు చేత పట్టుకొని, బ్యాడ్జీలు, కండువాలు ధరించి నినాదాలు చేస్తూ పట్టణంలో నిర్వహించిన ప్రదర్శనతో ధార్మిక శోభ కనిపించింది. నాయకవీధి పీర్ల చావిడిలో 'ఆసారే షరీఫ్' ప్రదర్శనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక నాయక వీధి, కోనేటి వీధి, హసన్ ఖాన్ వీధి, మక్కా మసీదు వీధులలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మహమ్మద్ మహా ప్రవక్త పవిత్ర జీవిత చరిత్రను కొనియాడుతూ భక్తి గీతాలను ఆలపించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమాల్లో రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, ముతవల్లీలు, మసీదుల ఇమామ్‌లు, జమాత్ పెద్దలు, మీలాద్ ఉన్ నబీ ఉత్సవ కమిటీ సభ్యులు, నౌజవాన్ కమిటీ సభ్యులు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **తంబళ్లపల్లె:** మండలంలోని ముస్లిం సోదరులు మిలాదున్ నబీ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నారు. **రామాపురం :** మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో ముస్లిం మైనారిటీ సోదరులు మహమ్మద్ ప్రవక్త జయంతి వేడుకలను ఘనంగా భక్తి పూర్వకంగా సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. మండలంలోని నీలకంఠరావుపేట, గువ్వలచెరువు, దూదేకులపల్లె, గంగనేరు, హసనాపురం, పకీరుపల్లె, వెంకట్‌రెడ్డిగారిపల్లె చిట్లూరు, కుమ్మరిపల్లె, నల్లగుట్టపల్లె, శుద్ధమల్ల తదితర గ్రామాలలో ఈ వేడుకను జరుపుకున్నారు. ఈ పండుగ ప్రజలలో సోదర భావం, ప్రేమ, కరుణ, ఐక్యత, సహనం, శాంతి మొదలుకు మంచి గుణాలకు మహమ్మద్ ప్రవక్త జీవితం మానవజాతికి ఆదర్శప్రాయమని పలువురు ముస్లిం పెద్దలు తెలిపారు. మసీదులలో అల్లా ప్రార్థనలు నిర్వహించారు.



వాల్మీకిపురం : ముస్లిములు నిర్వహించిన ఈద్-మీలాద్-జులూస్



రాజంపేట : దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న బత్యాల

వైసిపి కుతంత్రాలను తరిమేస్తాం : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన నాయకుడిని రాజకీయంగా ఎదుర్కోలేక వైసిపి ప్రభుత్వం కక్ష పూరితంగా అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసి రిమాండుకు పంపించిన ముఖ్యమంత్రి కుట్రలను ఛేదిస్తామని, వివిధ ప్రాంతాల్లో వైకాపా నాయకులు చేస్తున్న కుతంత్రాలను తరిమేస్తామని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడు ధ్వజమెత్తారు. చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా బత్యాల ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో భాగంగా గురువారం నాటికి 16వ రోజుకు చేరుకున్నాయి. జనసేన పార్లమెంట్ సమన్వయకర్త రామా శ్రీనివాసులు ఆధ్వర్యంలో దీక్షకు మద్దతుగా సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలోనియోజకవర్గంలోని సిద్ధవటం, నందలూరు, టి.సుండుపల్లి, రాజంపేట అర్బన్, రూరల్ మండలాల నుండి పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాదాధికారులు పాల్గొన్నారు.

రాయచోటి : రాష్ట్రంలో వైసిపి పతనం ప్రారంభమైందని మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించడానికి నిరసిస్తూ స్థానిక టిడిపి కార్యాలయంలో వడ్డెరులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి రిమాండ్‌కు పంపించిన విషయంలో ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆయన కడిగిన మద్యంలో కేసుల నుంచి బయటపడతారన్నారు. వైసిపి ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక మరచిందన్నారు. ప్రతిపక్షాల నేతలను వేధింపులకు గురి చేయడమే ధ్యేయంగా ముందుకు వెళుతుందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నాయకులు నరసారెడ్డి, వెంకట రమణారెడ్డి, పార్థసారథిరెడ్డి, ఉమాపతిరెడ్డి, జీలాన్‌బాషా, సుబ్బయ్య, నరసింహారెడ్డి, నాగేశ్వర, రాఘవ, ఆవుల కుంట వెంకటేష్, సంజీవ, ఈశ్వరయ్య, వెంకటరమణ, రమణ, శీను, వెంకటరామిరెడ్డి, గంగయ్య, బడుగు వాసు, మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

5న పార్లమెంట్ స్థాయి సమావేశం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో అక్టోబర్ 5న రాజంపేట పార్లమెంటు స్థాయి సమావేశం, ర్యాలీ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్‌పార్టీ మదనపల్లె నియోజకవర్గ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ పేర్కొన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఎస్.రెడ్డి సాహెబ్, సురేంద్ర రెడ్డి, డాక్టర్ ఎస్.కే. బాషా, మహబూబ్ పీర్, మహమ్మద్ అలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ మదనపల్లె శ్రీరామ కల్యాణ మండపంలో రాజం పేట పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల కన్వీనర్లతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.

రేపు జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ఈనెల 30న శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిమ్మనపల్లెలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శేషగిరిరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి నిమ్మనపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం జరుగుతుందన్నారు. నిమ్మనపల్లి-2 సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష వైద్య సర్వేలు కు నమోదు చేసుకుని వైద్య చికిత్సలు అవసరం ఉన్న వారికి చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. నమోదు చేసుకున్న వారు శిబిరానికి హాజరు కావాలని కోరారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

భవననిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించి సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి సలీంబాషా, జిల్లా వర్కింగ్ అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. పెండింగులో ఉన్న క్లైములకు వెంటనే నిధులు మంజూరు చేయాలన్నారు. 2007లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి భవన నిర్మాణ కార్మికులను ఆదుకొనుట కొరకు ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేశారని అన్నారు. ఈ సంక్షేమ బోర్డులో రాష్ట్ర వ్యాప్తంగా 22 లక్షల మంది కార్మికులు నమోదు చేయించుకుని సంక్షేమ కార్డులు ద్వారా సంక్షేమ ఫలాలు అనుభవించేవారన్నారు. వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుండి ఇప్పటివరకు సుమారు 32 వేల పైచిలుకు క్లైయిములు పెండింగులో ఉన్నాయని అందు వలన కార్మికులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పెండింగులో ఉన్న క్లెయిములకు సంబంధించిన నిధులను వెంటనే మంజూరు చేయాలన్నారు. యజమాని నుంచి సెస్ రూపంలోనూ వసూలు చేయబడిన కోట్ల రూపాయలను కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు పెట్టాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు నుండి పవర్ ఫైనాన్స్ పేరుతో కార్పొరేషన్లకు దారి మళ్లించిన నిధులను వెంటనే బోర్డులో జమ చేయాలని, ఇతర రాష్ట్రాల మాదిరిగా మన రాష్ట్రంలోను ప్రభుత్వ స్కీమ్లు పథకాలతో పాటు, కార్మిక సంక్షేమ బోర్డును పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు గోపిదిన్నె ఉన్నత పాఠశాలలో ఇద్దరు బాలికలు ఎంపికైనట్లు హెచ్ఎం.చంద్రశేఖర్ తెలిపారు. 9వ తరగతి విద్యార్థిని పల్లవి, పదవ తరగతి విద్యార్థిని హేమలతలు పిఇటి ఈశ్వరమ్మ సూచనల మేరకు వాలీబాల్ ఆటలో ప్రావీణ్యం పొందారు. తిరుపతి జిల్లా దుర్గసముద్రం జడ్‌పి ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆ బాలికలు చదువుతోపాటు ఆటల్లోనూ రాణిస్తూ పాఠశాలకు మంచి పేరు తెచ్చారని అన్నారు. ఆ బాలికలను సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి ఉపాధ్యాయులు అభినందించారు.

ఉద్దేశపూర్వకంగానే దుష్ప్రచారం

ప్రజాశక్తి-పీలేరు

ఉద్దేశపూర్వకంగానే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని పీలేరు వైసిపి సీనియర్ నాయకులు, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎండి షఫీ తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ తాను గత 35 ఏళ్లుగా పెద్దిరెడ్డి కుటుంబానికి విధేయుడని, భవిష్య త్తులోనూ వారితోనే నడుస్తానని అన్నారు. నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వారికి ఎదురొడ్డి సర్పంచ్‌గా పోటీ చేశానని అన్నారు. కొంతమంది తాను డబ్బుకు ఆశపడి తన భార్య సర్పంచ్ పదవి వదులుకున్నానన్న దుష్ప్రచారం చేస్తూ, సమాజంలో తనను అగౌరవ పరుస్తున్నారన్న ఆవేదన వ్యక్తం చేశారు. స్వార్థం కోసం ఎవరిని ప్రలోభ పెట్టలేదన్నారు.

డిప్యూటీ సిఎంకు సన్మానం

ప్రజాశక్తి - కడప

బుడగ జంగాలను ఎస్‌సి కలిపేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయడం చాలా సంతోషించదగ్గ విషయమని బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు, వైసిపి యువజన జిల్లా కార్యదర్శి పస్తం అంజి అన్నారు. గురువారం పస్తం అంజి ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషాను, మేయర్ సురేష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షులు సుబ్బారెడ్డి, నాయకులు రాంమోహనరెడ్డి, బంగారు నాగయ్య, జయచంద్ర రెడ్డి, తోట కృష్ణ, యాసిన్ బాషా, బుడగ జంగం నాయకులు ఎం. జమ్మయ్య, కే. లక్షుమ్మయ్య, డి. రాముడు, పి. ఆంజనేయులు, సి. చిన్న వెంకటయ్య, పాల్గొన్నారు.

స్వామినాథన్‌తో చిత్రకారుడి అనుబంధం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు


స్వామినాథ్‌తో కలిసిన జ్ఞాపకాలు (ఫైల్ ఫొటో)

భారతదేశ అత్యున్నత పౌరపురస్కారాలు పొందిన భారత వ్యవసాయ శాస్త్రవేత్త జన్యుశాస్త్ర నిపుణుడు హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్. స్వామినాథన్‌తో ప్రొద్దుటూరు ప్రముఖ చిత్రకారుడు తుపాకుల రామాంజనేయరెడ్డికి అనుబంధం ఉంది. స్వామినాథన్(98) గురువారం ఉదయం చెన్నయ్‌లో వృద్ధాప్య కారణంగా మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన గత స్మృతులను నెమరేసుకున్నారు. తన సహచర చిత్రకారిణి ప్రసన్నతో స్వామినాథన్ స్వీయ చిత్రపటాన్ని సేవ్‌గర్ల్ చైల్డ్ ప్రాజెక్ట్‌లో భాగంగా చిత్రీకరించి అందజేశానన్నారు.

ఉద్యోగులను నమ్మించి మోసగించిన సిఎం

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులను నమ్మించి మోసగించారని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లడుతూ ఉద్యోగుల విషయంలో మాట తప్పి, మడమ తిప్పారని ఎద్దేవా చేశారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ఉద్యోగులకు మాట ఇచ్చారన్నారు. సకాలంలో పిఆర్‌సి అమలు చేయడంతోపాటు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందికి పనికి తగ్గ వేతనం కల్పించి, అంగన్వాడీలకు తెలంగాణ రాష్ట్రం కంటే వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తామని వైసిపి తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొందన్నారు. జగన్ మాటలను వారు ఓట్లు వేశారన్నారు. రాష్ట్రంలో దాదాపు 2 లక్షల 50 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులున్నారన్నారు. కంటి తుడుపు చర్యగా 10,117 మందిని మాత్రమే రెగ్యులరైజ్ చేయడం దుర్మార్గమన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను అమలు చేయాలని తులసిరెడ్డి కోరారు.

వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న పంట

- ఆదుకోవాలని రైతులు వేడుకోలు

ప్రజాశక్తి - బి.కొత్తకోట


నేలకొరిగిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు శ్రీరాములు

ఇటీవల కురిసిన వర్షాలతో మండల పరిధిలోని జనుపు వారిపల్లిలో మొక్కజొన్న పంట తీవ్రంగా దెబ్బతింది. జనుపువారిపల్లిలో రైతు రామన్న ఒక ఎకరా పొలంలో మొక్కజొన్న సాగుచేశారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మొక్కజొన్న పంట పూర్తి ఒరిగిపోవడంతో రూ.50 వేల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు రెడ్డప్ప రెండు ఎకరాలలో మొక్కజొన్న సాగు చేయగా అందులో ఒక ఎకరా పంటకు నష్టం వాటిల్లినట్లు చెప్పారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ మొక్కజొన్న పంట సాగు చేసి చేతికందే సమయంలో అకాల వర్షం కారణంగా కొంతవరకు మొక్కజొన్న పంట ఒరిగిపోయినట్లు నష్టం వాటిలిందన్నారు. ఎకరాకు రూ.50వేలు చొప్పున ఖర్చు చేయడం చేశా మని వర్షం కారణంగా పంట పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు స్పందించి పంటకు నష్ట పరి హారం అందేవిధంగా ప్రభుత్వానికి నివేదిక పంపి ఆదుకోవాలని కోరారు.

అర్హులందరికీ ఇళ్లు : ఎంపిపి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి శ్రీదేవి రవికుమార్

ప్రజాశక్తి-కలకడ

సొంత నివాసం లేని అర్హులైన వారందరికీ తప్పనిసరిగా ఇళ్లు మంజూరు చేస్తామని ఎంపిపి శ్రీదేవిరవికుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవరత్నాలలో ఒకటైన పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా అర్హులందరికీ పక్కా గృహాలను మంజూరు చేస్తామని చెప్పారు. సొంతిల్లు లేని అర్హులను గుర్తించి వారందరికీ ఇళ్లు మంజూరయ్యేందుకు కృషి చేయాలని చెప్పారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హత కలిగి లబ్ధిదారులెవ్వరూ ఇళ్లులేదని చెప్పకూడదన్నారు. మరుగుదొడ్ల కోసం ప్రభుత్వం అదనంగా రూ.12వేలు చెల్లిస్తోందని, ఇంకుడు గుంతలకు రూ.6వేలు ఇస్తుందని చెప్పారు. లబ్ధిదారులు త్వరగా ఇల్లు నిర్మించుకునేల తెలియచేయాలని హౌసింగ్ ఎఇ రమణయ్య, ఎంపిడిఒ పర మేశ్వర్‌రెడ్డిలకు సూచించారు. కార్యక్రమంలో వర్క్ ఇనస్పెక్టర్ నాగముని నాయక్, డిఎ ప్రతాప్ పాల్గొన్నారు.

రిటైర్డ్ డిఎస్‌పికి ఘననివాళి

ప్రజాశక్తి-గాలివీడు


రిటైర్డ్ డిఎస్‌పికి నివాళి అర్పిస్తున్న మిట్టపల్లి వేదమూర్తిరెడ్డి

మండల పరిధిలోని ఫకీరారెడ్డిగారిపల్లెలో రిటైర్డ్ డిఎస్‌పి గొర్లముదివేటి హేమకుమార్ భౌతికకాయానికి గురువారం గాలివీడు పిఎసిఎస్ అధ్యక్షులు మిట్టపల్లి వేదమూర్తిరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హేమకుమార్ తండ్రి ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ తన కుమారులను కూడా ఉన్నత ప్రయోజకులుగా చేశారని పేర్కొన్నారు. హేమకుమార్ చేసిన సేవలను ఆయన ప్రశంసించారు. మృతుని భార్య, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల్లో మాజీ జడ్‌పి వైస్‌చైర్మన్ మండిపల్లి దేవనాథరెడ్డి, వైస్ ఎంపిపి-1 మిట్టపల్లి యధుభుషణ్‌రెడ్డి, గాలివీడు సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి, మాజీ ఎంపిపి అరుణమ్మ, ఉమ్మడి కడప జిల్లా సిఐలు, ఎస్ఐలు, ఉపాధ్యాయులు, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తంగాల వేణుగోపాల్ బంధువులు పాల్గొని పాల్గొని ఘనంగా నిర్వహించారు.

విజయనగరం జట్టు విజయం

ప్రజాశక్తి - కడప


బ్యాటింగ్ చేస్తున్న విజయనగరం జట్టు

కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్- 23 ఇంటర్ జోనల్ మెన్ వన్డే క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా గురువారం వైయస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టుపై ఆరు వికెట్ల తేడాతో విజయనగరం జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఎం. వంశీకృష్ణ బ్యాటింగ్లో అద్భుతంగా రాణించి 122 పరుగులు (సెంచరీ) చేశాడు. విజయనగరం జట్టులోని వై. వాసు 4, టి. దీపు భార్గవ్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 255 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన విజయనగరం జట్టు 49.1 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 260 పరుగులు చేసి ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ గట్టులోని జి.ఎస్.పి తేజ 85, రవి కిరణ్ 88 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టులోని సిద్ధార్థ రెండు వికెట్లు తీసుకున్నాడు. కె ఎస్ ఆర్ ఎమ్ క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టుపై 51 పరుగుల తేడాతో నెల్లూరు జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 49.2 ఓవర్లలో 268 పరుగులకు ఆల్ అవుట్ అయింది.

అనంతరం 269 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు 45.2 ఓవర్లలో 217 పరుగులు చేసి ఆల్ అవుట్ అయి ఓటమి చెందింది. ఆ జట్టులోని ఎస్. వి. రాహుల్ 80 పరుగులు చేశాడు. నెల్లూరు గట్టులోని ఎన్. మాధవ్ 4, సాకేత్ రామ్ 3 వికెట్లు తీసుకున్నారు కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్ లో కృష్ణ జట్టుపై ఏడు వికెట్ల తేడాతో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన క్రిష్ణా జట్టు 20.5 ఓవర్లలో 79 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని విశాల్ 23 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టులోని చెన్నారెడ్డి 5, విజయ్ భావేంద్ర 2, ఇస్మాయిల్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 80 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు 14.3 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసి ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని భవానీ ప్రసాద్ 34 (నాటౌట్) పరుగులు చేశాడు. కృష్ణా జట్టులోని చిన్న, యోచన్, బ్రహ్మ తేజ ఒక్కో వికెట్ తీసుకున్నారు.

హ్యాండ్ బాల్ పోటీల్లో 'లిటిల్ ఫ్లవర్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె

జిల్లాస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్ఎఫ్ బాషా తెలిపారు. అండర్-14 విభాగంలో సారా, రెడయ్య ఎంపికైనట్లు చెప్పారు. అలాగే ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన పోటీల్లో అండర్-17 విభాగంలో వినయ్‌కుమార్, జిక్రా సాల్వేహ, అండర్-14లో అదిభా, సమీర్, మహమ్మద్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక య్యారని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయిలో జరిగే క్రీడా పోటీలకు ఎంపికైనందుకు సంతోషంగా ఉందన్నారు. పిఇటి జనార్దన్, విద్యార్థులను ప్రదానోపాధ్యాయులు ముబీనా, డైరెక్టరు అన్వర్ ఉల్ హక్, ఇన్‌చార్జ్ ఇక్బాల్‌బాషా అభినందించారు.

గృహోపకరణాలు వితరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

షాహిద్ భగత్ సింగ్ త్యాగనిరతి, భరత జాతి చరిత్ర ఉన్నంత వరకు చిరస్మరణీయంగా ఉంటుందని , ఆయన చూపిన తెగువ, పట్టుదల, దేశభక్తి, పోరాట తత్వాన్ని నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలని పట్టణ ఎస్ఐ సత్యనారాయణ పేర్కొన్నారు. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని స్థానిక ముద్దనూరు రోడ్డులోని విభిన్నప్రతిభావంతుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఐ, కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రీనాథ్ నాయక్ పాల్గొని భగత్‌సింగ్ చిత్రపటానికి పూల మాలవేసి ఘననివాళులు అర్పించారు. అనంతరం స్థానిక కెనరా బ్యాంకులో ఉద్యోగిగా పనిచేస్తున్న నల్లపురెడ్డిపల్లెకు చెందిన మూలి వెంకటరమణారెడ్డి అనే అంధుడు తోటి విభిన్నప్రతిభావంతులకు గృహోపక రాలను ప్రముఖులచే పంపిణీ చేశారు. కార్యక్రమంలో విభిన్నప్రతి భావంతుల నెట్‌వర్క్ నాయకులు , కార్యవర్గసభ్యులు వేణు, అమీర్ బాషా పాల్గొన్నారు.

కుల వివక్ష చూపారంటూ ఎస్‌సిల నిరసన

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని తిప్పలూరు గ్రామంలోని పెత్తందారులు ఎస్‌సి కాలనీవాసులపై కుల వివక్ష చూపుతున్నారంటూ ఎస్‌సిలు ఆరోపించారు. పెత్తందారులకు వ్యతిరేకంగా గురువారం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఎస్‌సిలు ధర్నా నిర్వహించారు. నినాదాలు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ధర్నాను విరమింపజేశారు. అనంతరం డిఎస్‌పి నాగరాజు, తహశీల్దార్ నాగేశ్వరరావు, సిఐ ఈశ్వరయ్య, ఎస్ఐలు ప్రవీణ్‌కుమార్, కృష్ణంరాజు నాయక్ తిప్పలూరు గ్రామానికి చేరుకొని జరిగిన విషయంపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌సి కాలనీ వాసులు మాట్లాడుతూ ఆదివారం జరిగిన వినాయక నిమజ్జనం సందర్భంగా గ్రామోత్సవాన్ని తమ ఇళ్ల నుంచి వెళ్లవద్దని పెత్తందారులు అడ్డుకున్నారని ఆరోపించారు. ఎస్‌సి కాలనీలో పెళ్లిళ్లకు, శుభకార్యాలకు మెరవని నిర్వహించరాదని తెలిపినట్లు ఆరోపించారు. పెత్తందారులు మాట్లాడుతూ డ్రమ్స్, డీజేలతో అధిక శబ్దం చేసుకుంటూ ఎక్కువ సమయాన్ని ఒకే చోట గడుపుతూ ఉండడంతో పశువులు బెదురుకొని జనావాసంలో పరుగులు పెట్టాయని, ఇళ్లలోని చిన్న పిల్లలు శబ్దాన్ని భరించలేక ఇబ్బందులు పడ్డారని కాస్తా త్వరగా వెళ్లండి అని చెప్పినట్లు తెలిపారు. కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారని పెత్తందారులు పేర్కొన్నారు. అనంతరం డిఎస్‌పి, తహశీల్దార్ రెండు కులాల పెద్ద వారిని పిలిపించి సర్ది చెప్పారు. ఇకమీదట గ్రామంలో ఎలాంటి కార్యక్రమాలు జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

టిడిపికి ప్రజల్లో సానుకూల స్పందన

- టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్రంలో టిడిపికి ప్రజల్లో సానుకూల స్పందన ఉప్పెనలా వచ్చిందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షకు గురువారం ఆయన సంఘీభావం తెలుపుతూ మాట్లాడారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు ఇంటింటికీ వెళితే.. ప్రజల గో బ్యాక్ అనే నినాదాలతో వారు వెనుదిరిగి వస్తున్నారన్నారు. ప్రజలలో ఉన్న తమ నాయకుడిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని ప్రజల్లో స్పందన వచ్చిందన్నారు. దీక్షలో తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు కూర్చున్నారు. చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. వైసిపి పాలనకు త్వరలోనే ప్రజలు చరమగీతం పాడుతారని అన్నారు. వైసిపి ఎన్ని కుట్రలు చేసినా టిడిపి ప్రభంజనాన్ని అడ్డుకోలేరని అన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా పార్టీకి అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభం

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని రేగడపల్లి పంచాయతీలో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ సెంటర్‌ను గురువారం జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రజాసేవకుడు, రైతు పక్షపాతి అని తెలియ జేయడానికి ప్రతి గ్రామ పంచాయతీలోనూ విలేజ్ క్లినిక్ పేరుతో గ్రామీణ వైద్యశాలలు ఏర్పాటు చేశార న్నారు. ప్రజలకు సరైన వైద్యాన్ని అందజేస్తున్నారని తెలిపారు. రైతులకు అందు బాటులో ఉండేలా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, పంటలను గుర్తించేందుకు ఇ క్రాప్ నమోదు నిర్వహిస్తున్నారన్నారు. కాంట్రాక్టర్ నిర్మలానందరెడ్డి, వెంకటాపురం మధుసూదన్‌రెడ్డి, కోడూరు రామసుబ్బారెడ్డి, రాజనర్సింహారెడ్డి, కె.పెద్దిరెడ్డి, తిమ్మాపురం శేఖర్, వైసిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చలో విజయవాడకు తరలిరండి

ప్రజాశక్తి - చాపాడు

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 30న చలో విజయవాడ చేపట్టామని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ పిలుపు నిచ్చారు. ఆ మేరకు గురువారం చలో విజయవాడ పోస్టర్స్ మైదుకూరు పట్టణంలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని అన్ని జిల్లా కేంద్రాల్లో చలో కలెక్టరేట్‌లు నిర్వహిస్తే రాష్ట్ర ప్రభుత్వం పోలీసులు చేత విద్యార్థి సంఘ నాయకులను, విద్యార్థులను బలవంతంగా అరెస్టు చేసిందన్నారు. అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. ఎన్నికల ముందు విద్యార్థులకు అండగా ఉంటానని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక పూర్తిగా ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాగచరణ్, హరి నాయక్, చందు, శ్రీనివాసుల, కాశీ పాల్గొన్నారు.


లబ్ధిదారులకు సిఎం రిలీఫ్‌ఫండ్ అందిస్తున్న డిప్యూటీ సిఎం అంజద్‌బాషా

సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

- డిప్యూటీ సిఎం అంజద్‌బాషా

ప్రజాశక్తి-కడప

సిఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని, పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసానిస్తోందని డిప్యూటీ సిఎం ఎస్.బి.అంజాద్‌బాషా అన్నారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద మంజూరైన రూ.10 లక్షల ఎల్ఒసిలు, రూ.9.30 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలవెన్నంటే ఉంటుందని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం వర్తించని జబ్బులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద పేదప్రజలకు ఆర్థిక సహాయం అందించినందుకు సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు ఆరు మందికి సిఎం రిలీఫ్ ఫండ్ కింద లివర్ ట్రాన్స్ ప్లాంట్ చికిత్సకు దాదాపు ఒక్కరికీ రూ.30 లక్షలు పైగా సాయం అందించినట్లు తెలిపారు. తొలుత కడప నగరానికి చెందిన నూనె రమేష్‌కి లీవర్ ట్రాన్స్ ప్లాంటేషన్ శాస్త్ర చికిత్స కొరకు వారి కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.10 లక్షల ఆర్థిక సహాయం క్రింద ఎల్ఒసిని, నగరానికి చెందిన భాస్కర్ రెడ్డి, రామయ్య, హజీరా బేగం లకు ఆరోగ్య చికిత్స లకు రూ.9.30 లక్షలు చెక్కులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ బంగారు నాగయ్యయాదవ్, నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, తోటకృష్ణ, కార్పొరేటర్లు శ్రీరంజన్‌రెడ్డి, జప్రుల్ల, జయచంద్రా రెడ్డి, శివానాయక్, గోపాలకృష్ణ, వైసిపి నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలన రివర్స్ : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్

వైసిపి ప్రభుత్వ పాలన రివర్స్‌గా నడుస్తూ ఉందని, లోకేష్‌ను చంద్రబాబు లాగా అక్రమ, కక్ష పూరితంగా అరెస్టు చేయాలని ప్రభుత్వం ప్రయతిస్తుందని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్నూర్ అక్బర్ అన్నారు. గురువారం పాత బస్టాండ్ లోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి ప్రారంభమైన చోట అవినీతి జరిగిందని అపద్దాలతో ప్రజలకు తప్పుడు సమాచారంతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. స్కిల్ డెవలప్మెంట్, ఫైబర్ నెట్, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డులో అవినీతి జరగలేదు అని స్పష్టం చేశారు. ప్రజలు తెలుగు దేశం ప్రభుత్వం, చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబు తప్పు చేయరని నమ్ముతున్నారని ప్రభుత్వం వారి పట్ల అప్రజా స్వామికంగా వ్యవహారిస్తూ అధికార దుర్వినియోగం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. లోకేష్ బాబు విలువలకు, ప్రజలకు, అభివృద్ధికి, సంక్షేమాని కట్టుబడి పనిచేసేవ్యక్తని అందులకు నిదర్శనం 2800 కిలోమీటర్లు నడచడమే అన్నారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు రూపనగుడి హుస్సేన్, అబ్దుల్ సలాం, ప్రొద్దుటూరు నజిర్, ఖాదర్‌సాబ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మున్నూరు అక్బర్

క్రైం కార్నర్

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు


పట్టుబడిన నిందితుడితో అటవీశాఖ సిబ్బంది

మండల పరిధిలోని ముడుంపాడు ఫారెస్ట్ బీట్ ఆవులదారి వద్ద ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న ఒకరిని అరెస్టు చేసి ఐదు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఆర్ఐ కృపానంద తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ టాస్క్ ఫోర్స్ డిఎస్‌పి చెంచుబాబు అధ్వర్యంలో ఆర్ఎస్ఐ కె.అల్లిబాష టీమ్ రైల్వే కోడూరు సబ్ కంట్రోల్ నుంచి బయ లుదేరి రాయవరం చేరుకున్నారని తెలిపారు. అక్కడ నుంచి రెడ్డివారిపల్లి, కావ లిపల్లి వైపు తనిఖీలు చేసుకుని వెళుతుండగా ముడుంపాడు ఫారెస్టు బీట్ ఆవుల దారి వద్ద కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారని చెప్పారు. వారిని చుట్టుముట్టి ఒకరిని పట్టుకోగా మిగిలిన వారు దుంగలు పడేసి పరారయ్యారని చెప్పారు. పట్టుబడిన నిందితుడు తమిళనాడు తిరుపత్తూరు జిల్లా ఆంబూరుకు చెందిన మురుగన్ పొన్నుస్వామిగా గుర్తించారు. తిరుపతి టాస్క్ ఫోర్సు ఎస్ఐ బి.మోహన్‌నాయక్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరారీలో ఉన్న నిందితులు అరెస్టు

పరారీలో ఉన్న నిందితుడు చిత్తూరు జిల్లా కుప్పంకు చెందిన ఎంజీఆర్ ఎలియాస్ రామచంద్రన్ (35)ను ఎస్ఐ మోహన్‌నాయక్ అరెస్టు చేశారు. నిందితుడు నాయుడుపేట-చిత్తూరు జాతీయ రహదారిలోని వకుళమాత ఆలయం క్రాస్ వద్ద ఉన్నట్లు కనుగొని అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరచగా జ్యుడిషియల్ రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

భార్య, మామపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-ములకలచెరువు

భార్య, మామపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని బుధవారం రాత్రి మొలకలచెరువు పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ గాయత్రి సమాచారం మేరకు.. ములకలచెరువు మండలం, దేవుల చెరువు పంచాయతీ రాజుగారిపల్లికి చెందిన దేవరాజు అదే గ్రామానికి చెందిన అపూర్వను ప్రేమ వివాహం చేసుకున్నాడని చెప్పారు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారని, దేవరాజు భార్య తండ్రి అయిన చంద్రశేఖర్ ఇద్దరూ కలిసి గ్రామంలో టమోటా పంట సాగు చేశారని తెలిపారు. మార్కెట్లో టమోటాలను విక్రయించిన సొమ్ములో తేడాలు రావడంతో కొద్దిరోజులుగా విభేదాలు మొదలయ్యాయని చెప్పారు. ఈనెల 26న మంగళవారం ఉదయం మామతో దేవరాజు గొడవపడినట్లు చెప్పారు. అడ్డువచ్చిన భార్యపై, మామపై కత్తితో దాడి చేసి పారిపోయాడని తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ వారిని గ్రామస్తులు చికిత్స నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని పేర్కొన్నారు. బుధవారం రాత్రి వేపూరు కోట క్రాస్ వద్ద నిందితుడు ఉన్నట్లు సమాచారం తెలుసుకొని సిబ్బందితో వెళ్లి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.


నిందితుడు దేవరాజు అరెస్టును చూపుతున్న పోలీసులు